بِسۡمِ اللّٰہِ الرَّحۡمٰنِ الرَّحِیۡمِ    نَحۡمَدُہٗ وَنُصَلِّیۡ عَلٰی رَسُوۡلِہِ الۡکَرِیۡمِ    وَعَلٰی عَبۡدِہِ الۡمَسِیۡحِ الۡمَوۡعُوۡد

وَلَقَدۡ نَصَرَکُمُ اللّٰہُ بِبَدۡرٍ وَّاَنۡتُمۡ اَذِلَّۃٌ (ఆలె ఇమ్రాన్:104)

సంపుటి 1

సంచిక 6

వార పత్రిక

# బదర్

ఖాదియాన్

The Weekly BADAR Qadian TELUGU

వార్షిక చందా 300/-రూ॥

సంపాదకులు: సయ్యద్ రసూల్ నియాజ్

ఉపసంపాదకులు: ముహమ్మద్ అక్బర్

www.akhbarbadarqadian.in

6 రజబ్ 1437 హి.ఖ, 14 షహాదత్ 1395 హి.శ, 14 ఏప్రిల్ 2016


## అహ్మదియ్యా వార్తలు

సయ్యద్నా హజ్రత్ అమీరుల్ ముమినీన్ అయ్యదహు తాలా బినస్రిహిల్ అజీజ్ అల్లాహ్ తాలా దయతో క్షేమంగానే యున్నారు. అల్‌హందులిల్లాహ్.

జమాఅత్ సభ్యులు హుజూరె అన్వర్ ఆయురారోగ్యము, ఉన్నత ఆశయాల సాధన, ప్రత్యేక రక్షణ కొరకు దుఆలు కొనసాగించ గలరు. అల్లాహ్ తాలా అనుక్షణం హుజూర్ ను రక్షించుచు సహాయ, సహకారాము అందించుగాక!

(ఆమీన్)

**దేవుడు ఒక్కడే, అతనికి సాటి మరెవ్వరు లేరని, అతడి ఉనికి, దైవ ఏకత్వమును విశ్వసించుట ప్రతి ఒక్కరికి అనివార్యమైనట్లే ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ప్రవక్తృత్వమును విశ్వసించుట అనివార్యమని, ఇదియే ఇస్లాం వాస్తవికత అను విషయంను అనుచరులు రజ్వానుల్లాహ్ అలైహిమ్ కాలము నుండి నేటి మా ఈ కాలము వరకు ఇస్లాం అన్ని వర్గాలలో ఏకాభిప్రాయము గలదు.**

## ఉపదేశములు : హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం

అదే విధముగా ఈ అంధకార కాలంలో ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లంను విశ్వసించడం, విముక్తి పొందుటకు వారిని అనుసరించడం తప్పనిసరి అని భావించనివారు ముస్లిములలో అనేకులు జన్మించినారు, అంతేగాకా స్వర్గంలో ప్రవేశించుటకు కేవలం అల్లాహ్ తాలా ఒక్కడే అని అతనికి సాటి ఎవ్వరు లేరని విశ్వసించినచో సరిపోతుందని భావిస్తున్నారు. మరికొందరు కేవలం అసత్యమాడుచు, నన్ను బాధించుటకు లేదా తమ తప్పుడు అలోచనల వలన నాపై అనేక నిందలను సంధించుచున్నారు. ఈ నిందల ఆధారంగా ప్రజలను ఈ జమాఅత్ నుండి వేరుచేయుటయే లక్ష్యంగా కొందరు ప్రయత్నిస్తుండగా, మరికొందరి స్వభావాలు ధార్మిక సూక్ష్మాంశాలను అర్ధం చేసుకొనుటకు ఆసక్తి చూపించడం లేదు. వారి స్వభావంలో చెడు ఉద్దేశం లేకున్నను, అర్ధం చేసుకొను వివేకం గాని, లేదా వాస్తవాన్ని స్వయంగా పరీక్షించి తెలుసుకొనునంత పరిజ్ఞానం కూడ వారికి లేదు. అందుకే ఈ ఆంశం చివరిలో వారందరి అనుమానాలన్నింటిని నేను దూరం చేయడమునే ఔచిత్యముగా భావించితిని.

ఈ అనుమానాలను నివృత్తి చేయుటకు ప్రత్యేక శ్రద్ధ చూపవలసి యుంటుందని నేను ఏనాడు భావించలేదు. ఎందుకనగా నేను రచించిన అనేక పుస్తకాలలో ఇలాంటి అభ్యంతరాలకు అనేక చోట్ల సమాధానాలు వ్రాసినాను. కాని ప్రస్తుత రోజులలో బటాలా ప్రాంతానికి చెంది అసిస్టెంట్ సర్జన్‌గా పని చేయుచున్న అబ్దుల్ హకీం ఖాన్ అనే ఒక వ్యక్తి గతంలో మన జమాఅత్‌లోని ఒక సభ్యుడు, కాని అతి తక్కువ సంప్రదింపుల వలన, సత్పురుషుల సాన్నిహిత్యం లభించనందున, ధార్మిక వాస్తవాలు సరిగా తెలియనందున, అహంకారం, మూర్ఖత్వంల సంకలనం వలన, చెడు తలంపు, అనుమానపు కూపంలో కూరుక పోయినందున అతడు తన దురదృష్టం కొద్ది మతభ్రష్టుడై ఈ జమాఅత్‌కే శత్రువుగా మారెను. అంతేకాక తనకు సాధ్యమైనంతవరకు దేవుని దివ్యకాంతిని మసకబాపడం కొరకు తన మూర్ఖత్వపు రచనలలో విషంను విరజిమ్ముచు దేవుడు తన స్వహస్తలతో వెలుగునింపిన జోతిని ఆర్పుటకు ప్రయత్నించుచున్నాడు. అందుకొరకే సంక్షిప్తంగానైన అతని నిందలలో ప్రజలకు ఉపయోగపడే కొన్నింటికైన సమాధానాలు వ్రాసి అందరికి చేరువయ్యేలా చూడాలని నిర్ణయించుకొంటిని. ఎందుకనగా ప్రజలు తమ పనులలో నిమగ్నమవుట వలన నా రచనలన్నింటిని చదివి ఆయా నిందలకు సమాధానాలు వెతుక్కోవడం సాధ్యము కాని పని.

అందువలనే అబ్దుల్ హకీం మతభ్రష్టుడగుటకు గల కారణాలను వ్రాయవలసి వచ్చుచున్నది. ఆ కారణాలు ఏమిటినగా, పరలోకములో విముక్తి పొందుటకు ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లంను విశ్వసించవలసిన అవసరం లేదని. అంతేగాకుండ దేవుడు ఒక్కడే, అతనికి సమానులు ఎవ్వరు లేరని విశ్వసించినచో (అతడు ఆంహజ్రత్ స.అ.స.ను అసత్యుడని భావించినను) విముక్తి లభించునని అబ్దుల్ హకీం విశ్వాసం. ఈ విశ్వాసం ప్రకారం అతని దృష్టిలో ఒక వ్యక్తి ఇస్లాం నుండి మత భ్రష్టుడైనప్పటికి విముక్తి పొందగలడని, మతభ్రష్టులను శిక్షించినచో వారిపై దౌర్జన్యం చేసినట్లుగా భావించబడునను అర్ధం. ఉదాహరణకు అబ్దుల్ ఘఫూర్ అనే వ్యక్తి మతభ్రష్టుడై ఆర్యసమాజంలో చేరి తన నామంను ధరమ్‌పాల్‌గా మార్చుకొని, పైగా రాత్రింభవళ్ళు ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లంను కించపర్చడం, దూషించడం వంటి పనులు చేయుచున్నా, అట్టి వ్యక్తి కూడ అబ్దుల్ హకీం దృష్టిలో ఏ ఆటంకం లేకుండ స్వర్గంలో చేరును. ఎందుకనగా ఆర్యులు విగ్రహారాధన చేయరు. కావున ఈ విశ్వాసము ప్రకారము ప్రవక్తల అవతరణ కేవలం వ్యర్థమైన, అనవసరమైన పక్రియగా మారునని వివేకులందరు గ్రహించెదరు. ఎందుకనగా ఒక వ్యక్తి ప్రవక్తను తిరస్కరించి, అతనితో శత్రుత్వం పెంచుకొని కూడ కేవలం దేవుడు ఒక్కడే అని విశ్వసించినంత మాత్రాన విముక్తి పొందినచో, ఈ ప్రక్రియ ద్వారా ప్రవక్తలందరు ఈ ప్రపంచముపైకి కాలక్షేపంనకు పంపించబడుచున్నారని,❖ లేదా వారు అవతరించకున్నను ప్రపంచములో పనులు కొనసాగునని, వారి ఉనికితో ఈ ప్రపంచమునకు ఏ అవసరము లేదని అర్ధం. ఒకవేళ కేవలం దేవుడు ఒక్కడే అని, అతనికి సాటి మరెవ్వరు లేరని విశ్వసించడమే చాలినచో ఇది కూడ ఒక విధమైన అన్యారాధనయే అగును. ఎందుకనగా "لَآ اِلٰہَ اِلَّا اللّٰہُ తోపాటు مُحَمَّدٌ رَّسُوۡلُ اللّٰہِ" జోడించబడెను. వాస్తవానికి ఇలాంటి తప్పుడు విశ్వాసం కలిగిన వారు مُحَمَّدٌ رَّسُوۡلُ اللّٰہِ అని ఉచ్ఛరించుటను కూడ అన్యారాధనగానే భావించెదరు, పైగా అల్లాహ్ తాలాతో పాటు మరెవరి నామమును జోడించడకపోవడమే స్వఛ్ఛమైన ఏకేశ్వర ఆరాధనగా భావించెదరు. అంతేకాక వారి దృష్టిలో ఇస్లాం నుండి భ్రష్టత్వం పొందినను విముక్తికి ఎలాంటి అవరోధము యుండదు. ఒకవేళ ముస్లిములందరు ఒకే రోజున ఇస్లాం నుండి బహిష్కరణ పొంది ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ప్రవక్తుత్వంను తిరస్కరించి, తప్పుడు మార్గంను సూచించు తత్వవేత్తల వలే కేవలం దేవుడు ఒక్కడే అని విశ్వసించినచో సరిపోవునని, తమకు తాము పవిత్ర ఖుర్‌ఆన్, ప్రవక్త (స.అ.స) అనుసరణను వీడి, ఈ రెండు ప్రక్రియలు అసత్యమైనవని నమ్మకం కల్గినా కూడ వారి దృష్టిలో వీరందరు మత భ్రష్టులైనను విముక్తి పొంది, ఎలాంటి అవరోధములు లేకుండానే స్వర్గంలో ప్రవేశించెదరు.

కాని దేవుడు ఒక్కడే, అతనికి సాటి మరెవ్వరు లేరని, అతడి ఉనికి, దైవ ఏకత్వమును విశ్వసించుట ప్రతి ఒక్కరికి అనివార్యమైనట్లే ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ప్రవక్తృత్వమును విశ్వసించుట అనివార్యమని, ఇదియే ఇస్లాం వాస్తవికత అను విషయంను అనుచరులు రిజ్వానుల్లాహ్ అలైహిమ్ కాలము నుండి నేటి మన ఈ కాలము వరకు ఇస్లాం అన్ని వర్గాలలో ఏకాభిప్రాయము గలదను విషయము అల్ప వివేకునికి కూడ తెలుసు. అదే విధముగా పవిత్ర ఖుర్‌ఆన్‌లో గల ఆదేశాలు, సూత్రాలను కూడ విశ్వసించడం తప్పనిసరి. ఈ విషయమునే ముస్లిములకు ఆరంభం నుండే అర్ధమయ్యే విధముగా విడమర్చి చెప్పడం జరిగినది. ఈ విశ్వాసంపైనే అనుచర సమాజం పటిష్టమైన నమ్మకంను కల్గి యుండడంతో వారు తమ ప్రాణాలను కూడ అర్పించిరి. అంతేగాకుండ ఎందరో స్వఛ్ఛమైన అనుచరులు ప్రవక్త కాలంలో శత్రువుల చేతిలో ఖైధీలుగా బంధించబడినప్పుడు ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ప్రవక్త ృత్వమును తిరస్కరించినచో విముక్తి లభించునని చెప్పినను అనుచరులెవ్వరు ప్రవక్త ృత్వమును తిరస్కరించలేక పోయిరి. పైగా ఆ లక్ష్యసాధన కొరకే దైవ మార్గంలో ప్రాణాలర్పించిరి. ఈ విషయాలన్ని ఇస్లామియా చరిత్రలో ఎంతటి ప్రాచుర్యంను పొందినవనగా ఇస్లామియా చరిత్రను గూర్చి ఏ కొద్ది అవగాహన కలిగిన వ్యక్తులు కూడ నేను వల్లించిన ఈ విషయంను తిరస్కరించలేరు.

❖ (అనుబంధం) ఒకవేళ వారందరు ఎవరైతే ప్రవక్తలను తిరస్కరించి వారితో శత్రుత్వంను పెంచుకొని కేవలం వారి స్వంత విశ్వాసాలతోనే విముక్తి పొందుట సాధ్యమైనచో అవిశ్వాసులందరికి ప్రళయ కాలం నాడు శిక్ష పడే బదులు ప్రవక్తలందరు ఒక రకమైన శిక్షకు గురగుదురు. ఎప్పుడైతే వారు తమను వ్యతిరేకించేవారిని, దూషించేవారిని, అపహాస్యం చేయువారిని, తమతో కఠినమైన శత్రుత్వంను ప్రధర్శించిన వారిని స్వర్గంలో ఉన్నతమైన మిద్దెలపై కూర్చొనుటను చూసి, తమకు లభించే ప్రతి పుణ్యఫలాలో వారిని కూడ భాగాస్వాములుగా చూసి, అంతేగాకుండ మిమ్ము తిరస్కరించినంత మాత్రమున మాకేమి నష్టము వాటిల్లినదని మరోసారి వారు అపహాస్యం చేసినచో ఆ క్షణాలలో ప్రవక్తలకు స్వర్గంలో సంచరించుట కూడ కఠినంగానే ఉండును.

*(హఖీఖతుల్ వహీ, రుహాని ఖజాయిన్ , సంపుటి 22, పుట 111-114)*


జమీల్ అహ్మద్ నాసిర్, ప్రింటర్ పబ్లిషర్ గారు ఫజ్లె ఉమర్ ప్రింటింగ్ ప్రెస్ ఖాదియాన్‌లో ముద్రించి అఖ్బారె బదర్ ఖాదియాన్ కార్యాలయము నుండి ప్రచురించిరి. ప్రోప్రైటర్, నిగ్రాన్ బదర్ బోర్డ్ ఖాదియాన్

**సంపాదకీయం :-**

# కర్మల సవరణ గూర్చి హితోపదేశము (1)

**(16 ఫిబ్రవరి 1919 తేదీన హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ రజియల్లాహు అన్హు మియాం షరాఫుద్దీన్ లాహోర్ గారి గృహములో చేసిన ప్రసంగము)**

హుజూర్ ఫాతిహా అధ్యాయము పఠించి ఇట్లు ఉపదేశించిరి.

గ్రహించు, గమనించు వారి కొరకు మానవుని జీవితము, అతని మరణములో అతని కొరకు ఒక గొప్ప గుణపాఠము గలదు.

**మానవుని – పశువు జీవితములో వ్యత్యాసము:**

మనము మానవున్ని చూచినప్పుడు అతని జీవితము, ఇతర పశువుల జీవితములలో ఒక పెద్ద వ్యత్యాసమును పొందెదము. ఇతర పశువుల జీవితము పరస్పరము మానవుని జీవితము వలె ముడిపడి లేదు. పశువులలో అధికాధికముగా ఒక ఆడ మగ అసవరముండును. ఇంత కంటే ఎక్కువ సంబంధము, సంప్రదించు అవసరము యుండదు. చిన్న స్థాయి గల ప్రాణుల విషయానికి వచ్చినచో ఒకే ప్రాణిలో ఆడ మగ శక్తి యుండును. కాని వాటి కంటే పెద్ద వాటిలో ఆడకు మగ అవసరముండును, మగకు ఆడ అవసరముండును. ఇంత కంటే ఎక్కువ మూడవ ప్రాని అవసరముండదు. కాని మానవున్ని దేవుడు ఎలా పుట్టించినాడనగా అతని గురించి ఒక్కరిద్దరి ప్రశ్న కాదు అతని అవసరాలు ఎంత విశాలమైనవనగా మానవులందరి కదలికల ప్రభావము అతనిపై పడును. ఎంతో సూక్ష్మమైన మార్పు వాస్తవానికి అతి చిన్న మార్పు అయినను ప్రభావముల రూపంలో ఎంత విస్తృతమై యుండుననగా ప్రపంచమంతటా వ్యాపించును. అనేక ప్రభావములు స్పష్టముగా కనిపించవు కాని యదార్థముగా మానవుని కర్మలు, ఆలోచన, సంభాషణ, కదలికలపై పెద్ద ప్రభావము చూపును. కొన్ని ప్రభావములు స్పష్టముగా కూడ కనిపించును.

**ఏ కదలిక వృథా కాదు:**

ఈ విషయములను అర్థము చేసుకొనుటకు ప్రజలలో ఇప్పుడున్నంత ప్రతిభ ఇంతకు ముందు లేకుండెను. ఎందుకనగా ఇప్పుడు ప్రకృతి సూత్రముల ద్వారా అతి సూక్ష్మాతి సూక్ష్మ ప్రభావము కూడ వృథా కాదని తెలుసుకోబడినది. ఏ కదలిక వృథా కాదనే సూత్రముపై ఆధారపడే తీగరహిత విద్యుత్తు సందేశము పంపుటను కనుగొనిరి. అనగా దీని అలలు వీచి ఒక ప్రాంతము నుండి మరో ప్రాంతమునకు చేరును.

**ఆధ్యాత్మిక ప్రపంచ అలలు:**

బాహ్య ప్రపంచములో అలలు వీచినట్లే ఆధ్యాత్మిక ప్రపంచములో కూడ అలలు వీచును. ఒక్కో సారి అవి ఎంత స్పష్టముగా యుండుననగా మానవుడు వాటిని తిలకించును. మరొకసారి ఈ తీగరహితమును తెలుసుకొను పరికరం యున్నవారికే తెలిసినట్లు ఇవి తెలియును.

**సందేశహరుల ఉనికితో అలలు:**

పెద్ద పెద్ద అలలు సందేశహరుల ఉనికితో పుట్టును. వారి ద్వారా పుట్టే అలలు తమ తమ సామర్థ్యమును బట్టి ఒక్కొక్క రాష్ట్రము, ఒక్కొక్క దేశము లేదా ప్రపంచమంతటా వ్యాపించును. ఇటువంటి అలలు ప్రపంచములో అనేకసార్లు వ్యాపించినవి, అనేకులు వాటిని గ్రహించిరి. చాలా ప్రాచీన చరిత్ర అందుబాటులో లేదు. కాని పవిత్ర ఖుర్ఆన్ ద్వారా హజ్రత్ నూహ్ అలైహిస్సలాం స్థితి తెలియును. వాస్తవానికి వారు ఇబ్బందులకు గురిచేయబడిరి. వారిని రక రకాలుగా బాధించినారు. అయినను వారిలో ఎటువంటి శక్తి యుండెననగా వారి ద్వారా వెలువడే అలను అనేక మంది చూచినారు, గ్రహించినారు. ఇదే విధముగా హజ్రత్ ఇబ్రాహీమ్ అలైహిస్సలాం హయాంలో అల లేచినది. ఇది ఒక విశాల భూభాగమును ఆవహించెను.

**హజ్రత్ మూసా (అ) కాలపు అల:**

గ్రహించబడిన అన్నిటికంటే పెద్ద అల మూసా అలైహిస్సలాం కాలములో పుట్టినది. ఎంత అల్ప స్థాయి నుండి వారు జాతిని తీసిరో గమనించుము. ఎంతటి క్రూర, ఘోర శత్రువుల ఆధీన్యము నుండి వారిని విడిపించినారు. బాహ్యముగా హజ్రత్ మూసా అలైహిస్సలాం వద్ద సైన్యము లేదా మరో రకమైన శక్తి లేకుండెను. కాని వారి హృదయములో అల్లాహ్ తఆలా విధేయత, వినమ్రత కొరకు నిండియున్న శక్తి వలన పుట్టిన అల వారి జాత్విలో జీవము పోసెను. ఆ జాతి ఎంతగా దిగజారిపోయెననగా ఒక ఖబ్తీ చూపు ఈ జాతిలోని ఒక వ్యక్తిపై పడినచో అతన్ని హత్యార్హుడిగా తీర్మానించేవారు. రాజు బయటికి వచ్చినప్పుడు ఎవరిపై చూపు పడకూడదని ముఖముపై ముసుగు ధరించి వచ్చును. ఒక జాతికి ఇంతకంటే ఘోర అవమానమేముండును ? ఏ వస్తువును ముస్లిములు ముట్టుకుంటారో అది అపవిత్రమగునని నేడు హిందువులు అంటున్నారు. ఇందుకు ముస్లిములు అసహ్యించుకొందురు, కోపగించుకొందురు. ఒక రకంగా వారి కోపము సమంజసముగా యుండును. కాని ఇస్రాయీల్ సంతతిని ఎంత నీచముగా భావించేవారనగా రాజు కూడ వారిని చూచుటను అసహ్యించుకొనుచుండెను. ముఖమును కప్పుకొని వచ్చేది. ఇస్రాయీల్ సంతతివారు తమ అవమానమును కప్పిపుచ్చుకొనుటకు ఫిరఔన్‌లు కుష్టురోగులు. అందుకే ముఖముపై ముసుగు వేసుకొని బయటికి వచ్చుచున్నారని అనేవారు. కాని అపవిత్ర ఇస్రాయీల్ సంతతిపై చూపు పడకూడదని ముసుగు ధరించేవారని చరిత్ర తెలుపుచున్నది. ఎవరైతే ఇంత నీచముగా భావించబడిరో, ఇటుకలు సిద్ధము చేయబడే అల్ప స్థాయి పనులు వారితో చేయించబడెనో, ఎలాంటి ఆందోళన, అయిష్టతతో ఇటువంటి పనులు చేసేవారో, ఈ అవమానము నుండి తప్పించుకొనుటకు ఎప్పుడైనా ఉద్రేకము ఏర్పడినను అది వెంటనే అణచివేయబడెను. అనంతరం ఇదే విధముగా స్వభావిక నీచత్వముతో పనిచేయుచుండిరి. ఇంతటి దిగజారిన, నీచ జాతిలో హజ్రత్ మూసా అలైహిస్సలాం అవతరించిరి. వారి ద్వారా ఎటువంటి అల వెలువడినదనగా వ్యాపించుచు క్రమేణ చాలా దూరము చేరినది. ఆ తరువాత దాని ప్రభావము కనిపించకున్నను ఏ అల ప్రభావరహితము కాదని నేను తరువాత నిరూపింతును. ఆ తరువాత చిన్న చిన్న అలలు పుట్టినవి. కాని 13 వందల సంవత్సరముల తరువాత ఒక అద్వితీయ అల పుట్టి ప్రపంచములోని అధిక భాగములో వ్యాపించినది.

**రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం కాలపు అల:**

అన్నిటికంటే చివరలో, అన్నిటికంటే పెద్ద అల రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం ద్వారా పుట్టినది. అప్పుడు ప్రజలు నిర్లక్ష్యముతో అంధకారములో సంచరించుచుండిరి. అందరిని మృత్యువు వశపరచుకొనెను. రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం ద్వారా అల్లాహ్ తఆలా ఆధ్యాత్మిక నదిలో ఉద్రేక పూరిత అలను పుట్టించెను. అది ఒక పరిమిత కాలము, ప్రత్యేక ప్రాంతమునకు సంబంధించినది కాక సర్వ ప్రపంచమునకు సంబంధించినది. ఇది అరబ్ దేశములో పుట్టినను బాహ్య రూపములో స్థాయి, దశలో ఎలాంటి ప్రాముఖ్యత కలిగి లేకుండెను. కాని దైవానుగ్రహముతో క్రమేణ వ్యాపించుచు ప్రపంచమంతటా వ్యాపించినది. ఇది దాని బాహ్య ప్రభావము. ప్రపంచమునకు కనిపించుచున్నది, ప్రతి వ్యక్తి విశ్వాసుడైనను అవిశ్వాసుడైనను దీనిని గ్రహించుచున్నాడు. ఐరోపా చరిత్రకారులతో సహా ఇస్లాం చరిత్రకారులు కూడ, యూదులు కూడ, క్రైస్తవులు కూడ దీనిని అంగీకరించుచున్నారు.

# జుమా ప్రసంగము

**మనము ఈ కాల ఇమామ్, దైవ సందేశహరుడు, మసీహ్ మౌవూద్, మహ్ది మాహూద్ మనలను పిలుచు మార్గముల వైపు తీసుకెళ్లే వ్యాపారము మనము చేయవలెను. తద్వారా మనము షైతాన్ అడుగుజాడల నుండి తప్పించుకోవలెను. అల్లాహ్ తఆలా ప్రీతిని పొందుచు బాధాకర శిక్ష నుండి తప్పించుకోగలము.**

**అల్లాహ్ తఆలా సామీప్యమును పొందుటలో ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఆదర్శమును అవలంభించుకొనుటలో లీనమైరి. కనుక నేడు కూడ గుర్తుంచుకొనుము. గౌరవ అనుచరులలో గల లీనము, విధేయత నేటి కాలములో ప్రవేశించనంత వరకు అభిమానులు, విశ్వాసులలో చేరు ప్రకటన నిజము, సమంజసము కాజాలదు. అల్లాహ్ తఆలా మీలో తిష్టవేయనంత వరకు, అల్లాహ్ తఆలా చిహ్నములు మీలో బహిర్గతము కానంత వరకు షైతాన్ ప్రభుత్వ జోక్యము యుండునని గట్టిగా గుర్తుంచుకొనుము**

**గుర్తుంచుకోవలసిన మరో విషయం ఏమనగా షైతాన్ దాడి హఠాత్తుగా జరగదు. అది క్రమ క్రమంగా దాడి చేయును. ఒక్క చిన్న పాపమును మానవుని హృదయములో కలిగించి ఇంత చిన్న పాపముతో ఏమి జరుగదు, ఇది ఏమాత్రం పెద్ద పాపము కాదనే ఆలోచనను పుట్టించును. అనంతరం ఈ చిన్న చిన్న పాపములే పెద్ద పాపమును ప్రోత్సహించును. దోపిడీ, హత్యలే పెద్ద పాపములనబడుట అనివార్యము కాదు. సమాజ శాంతిని భంగపరచే ప్రతి చర్య పెద్ద పాపముగానే పరిగణించబడును.**

**ఏ రోజున మానవుని హృదయంలో విశ్వాసం జనించునో ఆ విశ్వాసంతో పాటు అల్లాహ్ తఆలా యొక్క గొప్పతనం, అనగా అతని శక్తి, అతని కీర్తి ప్రతిష్టలు, అన్నింటిని మించి لَا اِلٰهَ اِلَّا اللّٰهُ యొక్క సరియైన భావం వారి హృదయంలో చేరుతుంది. తద్వారా అల్లాహ్ తఆలా వారిలో స్థిర నివాసంను ఏర్పర్చుకొంటాడు. తద్వార షైతాన్ జీవితానికి మరణం సంభవించును. అంతేగాకా పాపపు స్వభావం అంతరించిపోతుంది, ఇది ఎంతటి అదృష్టమైన జీవితం అనగా ఒకవేళ విశ్వాసం పరిపూర్ణమైనచో అతని పాపపు స్వభావం కూడ మరణించును. అప్పుడే ఒక నూతన జీవితం ప్రారంభమవుతుంది.**

**సయ్యద్నా అమీరుల్ ముమినీన్ హజ్రత్ మిర్జా మస్రూర్ అహ్మద్ ఖలీఫతుల్ మసీహిల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ క్రీ.శ. 11 మార్చి 2016 (11 అమాన్ 1395 హి.షు) తేదీన మస్జిద్ బైతుల్ ఫుతూహ్, లండన్‌లో ప్రసంగించిన ఖుత్బా జుమా.**

أَشْهَدُ أَنْ لَّا إِلٰهَ إِلَّا اللّٰهُ وَحْدَهٗ لَا شَرِيكَ لَهٗ وَأَشْهَدُ أَنَّ مُحَمَّدًا عَبْدُهٗ وَرَسُولُهٗ

أَمَّا بَعْدُ فَأَعُوذُ بِاللّٰهِ مِنَ الشَّيْطٰنِ الرَّجِيمِ - بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيمِ

اَلْحَمْدُ لِلّٰهِ رَبِّ الْعَالَمِيْنَ ۔ اَلرَّحْمٰنِ الرَّحِيْمِ ۔ مٰلِكِ يَوْمِ الدِّيْنِ ۔

اِيَّاكَ نَعْبُدُ وَاِيَّاكَ نَسْتَعِيْنُ ۔ اِهْدِنَا الصِّرَاطَ الْمُسْتَقِيْمَ ۔

صِرَاطَ الَّذِيْنَ اَنْعَمْتَ عَلَيْهِمْ غَيْرِ الْمَغْضُوْبِ عَلَيْهِمْ وَلَا الضَّآلِّيْنَ ۔

يٰٓاَيُّهَا الَّذِيْنَ اٰمَنُوْا لَا تَتَّبِعُوْا خُطُوٰتِ الشَّيْطٰنِ ۔ وَمَنْ يَّتَّبِعْ خُطُوٰتِ الشَّيْطٰنِ فَاِنَّهٗ يَاْمُرُ بِالْفَحْشَآءِ وَالْمُنْكَرِ ۔ وَلَوْلَا فَضْلُ اللّٰهِ عَلَيْكُمْ وَرَحْمَتُهٗ مَا زَكٰى مِنْكُمْ مِّنْ اَحَدٍ اَبَدًا وَّلٰكِنَّ اللّٰهَ يُزَكِّيْ مَنْ يَّشَآءُ ۔ وَاللّٰهُ سَمِيْعٌ عَلِيْمٌ ۔

(అన్నూర్:22) అనగా ఓ విశ్వాసులారా! షైతాన్ అడుగుజాడలపై నడువకుము. ఎవరేని షైతాన్ అడుగుజాడలపై నడిచినచో అది నిశ్చయముగా అశ్లీల, అయిష్టమైన విషయములను ఆదేశించును. అల్లాహ్ దయానుగ్రహము, కనికరమే మీ పై యుండనిచో మీలో నుండి ఒక్కరు కూడ ఎన్నడు పవిత్రులు కాలేరు. కాని అల్లాహ్ కోరువానిని పవిత్రునిగా చేయును. అల్లాహ్ సర్వశ్రవణ సమర్థుడు, సర్వజ్ఞుడు.

ఆది నుండి షైతాన్ మానవుని శత్రువు, ఆ శత్రుత్వం తుది వరకుండును. తుది వరకుండుటకు దానిలో ఏదో ఒక శక్తి యున్నదని కాదు. కేవలం తన దాసులు షైతాన్ దాడుల నుండి సురక్షితముగా యుందురని అల్లాహ్ తఆలాకు తెలుసు కనుక మానవుడు జన్మించినప్పుడు అల్లాహ్ తఆలా మానవునికి స్వాతంత్ర్యము ప్రసాధించి అధికారమిచ్చెను. షైతాన్ ముందుకు వచ్చి పోరాడ లేదు కావున దాని శత్రుత్వము ఏదో భహిరంగ శత్రుత్వము కాదు. వివిధ సాకులు, కుట్రలు, ప్రాపంచిక ఈర్ష్యలతో మానవుని అహంకారమును రెచ్చగొడుతు మానవున్ని సత్కార్యముల నుండి దూరము చేయును. దుష్కార్యాములకు సమీపులను చేయును. షైతాన్ దేవునితో ఇట్లనెను. ఏ స్వభావముతో నీవు మానవున్ని పుట్టించితివో ఆ స్వభావంతోనే నేను వారిని నా అనుచరులుగా మార్చుకుంటాను. అపుడు వారు దుష్కార్యముల వైపు ఎక్కువ దృష్టి సారింతురు. అనగా మానవుడు రెండు వైపుల ఆకర్షితుడగునట్లు అతనిలో స్వభావము గలదు. నీవు నాకు అనుమతిచ్చినచో అన్ని దారుల నుండి నేను అతనిపై దాడి చేయుదును. అన్ని విధాలుగా నేను అతన్ని మోసము చేయుదును. కాని నీ నిజమైన దాసులు, స్వచ్ఛమైన దాసులు నా దాడుల నుండి తప్పించుకొందురు. వారిపై నా ఏ కుట్రలు, కుతంత్రాలు సఫలము కాజాలవు. వారు కాకుండ మిగలినవారందరు నా అడుగుజాడలపైనే నడుచుదురు. అల్లాహ్ దానికి అనుమతిచ్చి, ఇట్లనెను. నీ వెనుక నడిచేవారిని నేను నరకములో పడవేయుదును.

కాని వెంటనే అల్లాహ్ తఆలా సందేశహరుల పరంపరను ప్రారంభించి, సత్కార్యముల మార్గములను మానవునికి చూపెను. వారికి సంస్కరణ పద్ధతులు కూడ తెలిపెను. తమ ఇహ, పరలోకమును చక్కదిద్దుకునే మార్గమును కూడ సూచించెను. అంతేగాకా షైతాన్ మీ శత్రువు అనే వాస్తవాన్ని మరియు అది సానుభూతిని ప్రదర్శించుతు సత్కార్యముల వైపు, ప్రయోజనాల వైపు కాకుండ చెడు వైపు, నష్టాల వైపు మిమ్ములను ఆహ్వానిస్తుందని కూడ తెలుపడమైనది. కాని ఏ రోజున అల్లాహ్ తఆలా మానవుని పాపపుణ్యముల లెక్కలను ప్రారంభించునో ఆ రోజు ఈ షైతాన్ చాలా సులువుగా, మొండివైఖరిని ప్రదర్శించుతు నేను మీకు ఆశ చూపించి దుష్కార్యముల వైపు, పాపముల వైపు, అల్లాహ్ తఆలా ఆదేశాలకు వ్యతిరేకంగా నడుచుటకు ఆహ్వానించినప్పుడు వివేక వంతులైన మీ మానవులు మీ వివేకంను ఎందుకు ఉపయోగించుకోలేదు? సత్కార్యములను ఆచరించుము, ఇతరుల శ్రేయస్సును కోరుకొనుము అనే దేవుని ఆదేశములపై నడుచుకోకుండ చెడు వైపు పిలుపునిచ్చిన నా ఆదేశమును ఎందుకు అనుసరించినారని తిరిగి ప్రశ్నించుతూ మీరు చేసిన దానికి ఇప్పుడు ఫలితము అనుభవించుము అని ఎగతాళి చేయును. అంతేగాకా ఇకపై నాకు మీతో ఎలాంటి సంబంధము లేదు. మీతో శత్రుత్వం నెరపడమే నా లక్ష్యం, నా లక్ష్యం నెరవేరినది. మీరు నరకంలో మండిపోవుము అని షైతాన్ మానవునితో శత్రుత్వంను ఏర్పర్చుకొనును.

పవిత్ర ఖుర్‌ఆన్‌లో కూడ అనేక చోట్ల షైతాన్ దాడులు, దాని సాకులు, కుట్రల నుండి అల్లాహ్ తఆలా మనలను హెచ్చరించెను. నేను పఠించిన ఈ సూక్తిలో కూడ షైతాన్ ఎల్లప్పుడు మానవున్ని వెంబడించును అని అల్లాహ్ తఆలా మనకు తెలిపెను. ఏనాడైతే షైతాన్ మానవునిపై ముందు నుండి, వెనుక నుండి, కుడి నుండి ఎడుమ నుండి దాడులు చేయుదునని అల్లాహ్ తఆలాతో వాగ్దానం చేసెనో అనాటి నుండి అది క్రమం తప్పకుండ నిర్దిష్ట

ప్రమాణాలతో దాడులు చేయసాగెను. నేటికి చేస్తూనే ఉన్నది. చివరికి షైతాన్ ఎంతవరకు తెగించినదనగా సన్మార్గంపైనే కూర్చోని మానవులపై దాడిచేయుదునని కంకణం కట్టుకొన్నది. ఒక సాధరణ మానవుడు నేను సన్మార్గంపై నడుచుచున్నాను నేను షైతాన్ దాడుల నుండి సురక్షితంగా యుందునని భావించుకొనును. కాని వాస్తవానికి అట్టి వ్యక్తి ఈ ఆలోచన చాలా తప్పిదమైనది. ఎందుకనగా ఎవరిపై అల్లాహ్ ప్రకోపం చూపబడినదో, ఎవరు మార్గభ్రష్టులైనారో వారందరు కూడ సన్మార్గంపైనే నడిచినవారు. అంతేగాకా హజ్రత్ మూసా అలైహిస్సలాం, హజ్రత్ ఈసా అలైహిస్సలాంలను విశ్వసించినవారే, కాని చివరికి విగ్రహారాధనలకు అలవాటు పడి, మార్గభ్రష్టులై ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లంను తిరస్కరంచిరి. అందువలనే మానవుడు విశ్వసించిన కూడ షైతాన్ అతడిని వెంటాడుచు అతనిని మార్గభ్రష్టున్ని చేయును. చాలా వరకు జనులు షైతాన్ మోసమునకు బలై, షైతాన్ మాటలను అనుసరించుచు మార్గభ్రష్టుడగును. చివరికి ముస్లిములుగా గుర్తించబడు వారు కూడ మతభ్రష్టులు, దురాచారులుగా మారెదరు. అందుకే ఈ షైతాన్ ప్రమాదం చాలా భయంకరమైన ప్రమాదం. అల్లాహ్ తఆలా అనుగ్రహమే మానవులను ఆయా ప్రమాదాల నుండి రక్షించును మరియు రక్షిస్తుంది కూడ.

అల్లాహ్ తఆలా సర్వశ్రవణ సమర్థుడను పదముతో ఈ సూక్తి చివరలో విశ్వాసికి నమ్మకమును కల్గించెను. కావున అతని ద్వారములను కొట్టుము. అతన్ని పిలువుము, నిలకడతో పిలువుము. అతని ఆస్థానములో సదా దుఆలు చేయుము. సర్వజ్ఞుడైన ఆ దేవునికి తన దాసుల స్థితులు తెలుసు. నా దాసుడు వినమ్రతతో నన్ను పిలుచుచున్నాడని అతడు చూచినపుడు, ఇటువంటి విశ్వాసుని హృదయములో షైతాన్ దాడుల నుండి సురక్షితముగా యుండే శక్తి ప్రసాధించును. సత్కార్యముల అతి గొప్ప ప్రమాణములు అందుకొను అనుగ్రహము లభించుగాక! దుష్కార్యముల నుండి దూరముండే శక్తి అతనికి లభించుగాక!

నీ స్వచ్ఛమైన దాసులు కాకుండ మిగిలిన వారందరు నన్నే అనుసరించెదరు అని షైతాన్ తెలిపినప్పుడు ఒక వివేక వంతుడు, ఒక విశ్వాసి మనము ఏ విధముగా స్వచ్ఛమైన దాసులము కాగాలము అని ఆలోచించవలసిన అవసరం ఎంతైన గలదు. స్వచ్ఛమైన దాసులగుటకు అల్లాహ్ తఆలా ఈ సూక్తిలో ఒక ఉపాయము తెలిపెను. అది ఏమనగా అశ్లీల, అయిష్టమైన ప్రతి విషయము నుండి మరియు అల్లాహ్ తఆలాను అసంతృప్తికి గురిచేయు విషయములన్నింటి నుండి తమను తాము రక్షించుకొనుట. అశ్లీల, అయిష్టమైన విషయము నుండి దూరమున్న వానిని అల్లాహ్ తఆలా కరుణించి పవిత్రము చేయును. అల్లాహ్ తఆలా పవిత్రము చేసిన వ్యక్తి పవిత్రుడగును. ఇటువంటి పవిత్రుల వద్దకు షైతాన్ రాదు.

గుర్తుంచుకోవలసిన మరో విషయం ఏమనగా షైతాన్ దాడి హఠాత్తుగా జరగదు. అది క్రమ క్రమంగా దాడి చేయును. ఒక్క చిన్న పాపమును మానవుని హృదయములో కలిగించి ఇంత చిన్న పాపముతో ఏమి జరుగదు, ఇది ఏమాత్రం పెద్ద పాపము కాదనే ఆలోచనను పుట్టించును. అనంతరం ఈ చిన్న చిన్న పాపములే పెద్ద పాపమును ప్రోత్సహించును. దోపిడీ, హత్యలే పెద్ద పాపములనబడుట అనివార్యము కాదు. సమాజ శాంతిని భంగపరచే ప్రతి చర్య పెద్ద పాపముగానే పరిగణించబడును. మానవుడు తాను ఏమి చేయుచున్నాడనే భావన అంతమైపోవును. అందుకే అల్లాహ్ తఆలా ఈ విధముగా తెలుపుచున్నాడు, ఒకవేళ మీరు పరిశుద్ధులు కావాలని కోరుకొన్నచో మీరు క్రమం తప్పకుండ పాపములన్నింటి నుండి రక్షించుకొనుచు షైతాన్ అడుగుజాడలో నడవకుండ యుండుటకు ప్రయత్నిస్తూ, అల్లాహ్ తాలా శరణంలో ఉంటూ పరిశుద్ధులగుటకు ప్రయత్నించుట తప్పనిసరి. క్రమం తప్పకుండ అనుక్షణం అల్లాహ్‌ను పిలుచుచు అతని సహాయంను ఆర్జించడం కూడ చాలా అవసరం. ఇలా కాకుండ మరే విధముగా మానవుడు షైతాన్ దాడుల నుండి రక్షించబడలేదు.

ఇప్పుడు నేను హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం గారి కొన్ని ఉపదేశములను మీ ముందు చదివి వినిపించెదను. అల్లాహ్ తఆలా షైతాన్‌ను ఎందుకు సృష్టించినాడు ? మొదటి రోజే అతని అహంకారమునకు శిక్షించి, అతన్ని ఎందుకు అంతము చేయలేదు. మొదటి రోజే షైతాన్‌ను అంతమొందించినచో ప్రపంచములో అశాంతి కలిగేదే కాదు కదా అని కొందరి హృదయాలలో ఈ ప్రశ్న తలెత్తును. దీని గురించి హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఒక చోట ఇట్లనిరి.

“ప్రతి వ్యక్తికి రెండు రకాల ఆకర్షణలు అనగా (ఆకిర్షించు లక్షణములు) గలవని ప్రతి ఒక్కరు అంగీకరింతురు”. “ఒకటి పుణ్యాకర్షణ, అతన్ని సత్కార్యముల వైపు ఆకర్షించును. రెండవది దుష్టాకర్షణ, అతన్ని దుష్కార్యము వైపు ఆకర్షించును. కొన్ని సార్లు మానవుని హృదయములో దుష్ట ఆలోచనలు కలుగునను విషయము అందరికి తెలిసినదే. అప్పుడుతను పాపమునకు ఎలా ఆకర్షితుడగుననగా ఒకరు అతన్ని పాపము వైపు లాగినట్లు అనిపించును. ఇలాగే కొన్ని సార్లు సత్యాలోచనలు అతని హృదయములో పడును. అప్పుడతడు సత్కార్యము వైపు ఎలా ఆకర్షితుడగుననగా ఒకరు అతన్ని సత్కార్యముల వైపు లాగినట్లు అనిపించును. ఒక్కో సారి ఒక వ్యక్తి పాపము చేసి మరల సత్కార్యము వైపు ఆకర్షితుడగును. నేను దుష్కార్యము చేసితినని చాలా పశ్చత్తాపపడును. ఒక్కో సారి ఒక వ్యక్తి ఒకరిని దూషించి, కొట్టిన తరువాత పశ్చత్తాపపడును. నేనీ నీచమైన పని చేసినానని హృదయములో భావించుకొని అతనితో ఏదో పుణ్యము చేసి క్షమాపణ కోరును” (చెడు చేసిన భావన అతనికి కల్గినచో). “ప్రతి మానవునిలో ఈ రెండు శక్తులు ఉండును”. (మానవుని స్వభావంను అల్లాహ్ తాలాయే సృష్టించెను.) “ఇస్లాం శాసనము పుణ్య స్వభావం గల శక్తికి రూహుల్ ఖుదుస్ అని, చెడు స్వభావపు శక్తిని షైతాన్ అని నామకరణం చేసినది. ఈ రెండు శక్తులు మానవునిలో గలవని తత్వవేత్తలందరు అభిప్రాయపడుదురు”. (అనగా చేడు స్వభావపు శక్తి, పుణ్య స్వభావపు శక్తి, కాని ఇస్లాం శాసనం పుణ్య స్వభావం గల శక్తికి రూహుల్ ఖుదుస్ అని, చెడు స్వభావపు శక్తిని షైతాన్ అని నామకరణం చేసినది) మొత్తమునకు తత్వవేత్తలు ఈ రెండు శక్తులు మానవునిలో గలవని విశ్వసించెదరు. కాని సర్వశక్తి వంతుడైన అల్లాహ్ అంతర్గత విషయాలను కూడ బహిరంగపరచి, (చాలా దూరపు, అతి గుప్త రహస్యను కూడ తెలుపును) “రాబోవు కాలములను గూర్చి, దాగియున్న రహస్యములను గూర్చి పూర్తి అవగాహన కల్గినవాడు, అతి సూక్ష్మ అంశాలను కూడ గమనించగల శక్తివంతుడు ఆ రెండు శక్తులను మానవులుగా పేర్కొనడం జరిగినది. ఎవరైతే సత్కార్యములను గూర్చిన ఆలోచనలను కల్గించునో అతని నామము దైవదూత అని, పరుశుద్ధ ఆత్మ అని, మరియు ఎవరైతే చెడు ఆలోచనలను కల్గించెదరో వారు షైతాన్, ఇబ్లీస్ అని నామకరణం చేయడమైనది”. ఇట్లనిరి. “పూర్వపు విజ్ఞానవేత్తలు, తత్వవేత్తలు అందరు దైవవాణి వ్యర్థమైనది, అశ్లీలమైనది కాదని విశ్వసించినారు”.

అనగా ఈ సమస్య వ్యర్ధమైనది కాదని, మానవుని హృదయంలో చెడు శక్తి లేదా చెడు ఆలోచనలు మరియు మంచి శక్తి అనే రెండు రకాల శక్తులు గలవని ఇది సరైనదేనని వారు విశ్వసించుతారు. ఈ విషయంను వివరించుచు హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఈ విధముగా తెల్పిరి:

“మానవులందరిలో ఉన్న ఈ రెండు శక్తులు, వాటిని నీవు రెండు శక్తులుగా పిలుచుకున్న లేదా పరిశుద్ధ ఆత్మ, షైతాన్ అని నామకరణం చేసుకొనిన కూడ నీవు ఈ రెండు శక్తుల ఉనికిని తిరస్కరించలేవు. వాటిని పుట్టించుటకు గల కారణం వాటి ద్వారా మానవుడు తన సత్కార్యాములకు ప్రతి ఫలము పొందుటకు అర్హుడగును. ఎందుకనగా ఒకవేళ మానవునిలో కేవలం సత్కార్యములను ఆచరించు శక్తియే యుండి తప్పని పరిస్థితులలో సత్కార్యములను మాత్రమే ఆచరిస్తు దుష్కార్యముల నుండి వైదొల్గినచో అప్పుడు మానవుడు చేసిన ఏ సత్కార్యమునకు కూడ ప్రతిఫలము లభించదు. ఇలా ఎందుకు జరుగుననగా అది ఆ మానవునిలో గల ప్రత్యేకత, కాని మానవుని స్వభావం రెండు శక్తుల మధ్యన నలుగుచు కేవలం సత్కార్యపు శక్తి వైపే మొగ్గుచూపుచు సత్కార్యములనే ఆచరించినచో ఆ మానవునికి ఆ ఆచరణ వలన తప్పక ప్రతిఫలం లభిస్తుంది”.

ఇట్లనిరి. “మానవుని హృదయంలో రెండు రకాల జ్ఞానములు కల్గుతాయి. కాని ఈ రెండు జ్ఞానములు మానవుని జన్మలోని భాగాలు మాత్రము కాదని తెలుస్తుంది”. (అనగా ఈ రెండు జ్ఞానములు జన్మతః ఏ మానవునికి రావు) “ఎందుకనగా ఈ రెండు పరస్పరం భిన్నమైనవి”. (అనగా ఈ రెండు పరస్పరం భేదాభిప్రాయాలు కల్గినవి. చెడు మరియు మంచి అనేవి కలసి ఉండవు. అదే విధముగా భాల్యం నుండే పిల్లల స్వభావంలో మంచి మరియు చెడు అనేవి ఉండవు.) ఈ రెండు పరస్పరం విరుద్ధమైనవని

అనిరి. "అంతేగాకా మానవుడు వీటిపై అధికారము సాధించలేడు. అందువలనే నిర్ధారణగా బడిన విషయం ఏమిటనగా ఈ రెండు జ్ఞానములు బాహ్య వాతావరణం నుండే జనించును". (సత్కార్యపు ప్రభావం మరియు దుష్కార్యపు ప్రభావం రెండింటిని మానవుడు పరిసరాల నుండే గ్రహించును. పిల్లలు మెల్లమెల్లగా మంచి వైపు ఆకర్షితులు కావడం, లేదా చేడు వైపు ఆకర్షితులు కావడం ఈ రెండు ప్రక్రియలు బాహ్య పరిసరాల పైనే ఆధారపడి ఉంటాయి.) "వాటి ఆధారంగానే మానవుని మనుగడ రూపుదిద్దుకొనును. ఆశ్చర్యకర విషయం ఏమిటనగా ఈ రెండు రకాల స్వభావాలు అనగా దైవదూత స్వభావం, షైతాన్ స్వభావములను హిందువుల గ్రంధములు కూడ అంగీకరించుతాయి. మరియు అగ్న్యారాధకులు కూడ విశ్వసింతురు". (అనగా అగ్నిని ఆరాదించువారు). "అంతేగాకా దైవం నుండి ఎన్ని గ్రంధాలు అవతరించబడినవో ఆ గ్రంథపు ధర్మములన్నియు ఈ స్వభావాలను స్వీకరించును. అట్టి పరిస్థితులలో మళ్ళీ అభ్యంతరాలు వ్యక్త పర్చడం కేవలం అసూయా, మూర్ఖత్వమే అవుతుంది. ఏ వ్యక్తి దుష్కార్యముల నుండి, దుష్టత్వంల నుండి తనను తాను రక్షించుకొనుటకు ప్రయత్నించడో అతడు షైతాన్‌గా మారునని అల్లాహ్ తెల్పినట్లు చివరికి అతడు కూడ షైతాన్‌గానే మారును అను సమాధానంనే అభ్యంతరాలు వ్యక్తపర్చువారికి నేను ఇచ్చెదను. అలాంటి పరిస్థితులలో అల్లాహ్ తఆలా వారిని ఎందుకు శిక్షించడు అని ప్రశ్నించెదరు". (షైతాన్‌గా పరివర్తనం చెందిన తరువాత వారిని ఎందుకు శిక్షించడం జరుగదనియు ప్రశ్నను లేవనెత్తెదరు.) "అందుకు సమాధానం ఏమనగా, అల్లాహ్ తాలా పవిత్ర ఖుర్‌ఆన్‌లో షైతాన్‌ను శిక్షించడం కొరకు ఒక నిర్దిష్టమైన దినమును నిర్ణయించి యున్నాడు. కావున ఆ రోజు కోసం వేచియుండవలెయును". (నేను షైతాన్‌ను తప్పక శిక్షించెదను, అది ఎప్పుడనగా, ఈ ప్రపంచములోనైన, పరలోకములోనైన నిర్దిష్టమైన రోజు తప్పకుండ శిక్షించబడును అని అల్లాహ్ తాలా తెలుపుచున్నాడు.) "ఎన్నో షైతాన్‌లు దేవుని హస్తముల ద్వారా శిక్షించబడినవి. శిక్షించబడును కూడ".

*(చశ్మయే మ'రిఫత్, రూహాని ఖజాయిన్, సంపుటి 23, పుట 293-294)*

ఏయే ఆశలను కల్పించుతు షైతాన్ తన వైపు ఆహ్వానిస్తుందో, ఎలాంటి వ్యక్తిత్వం గలవారు షైతాన్ యొక్క అడుగుజాడలలో నడుస్తుంటారో. ఏ కోరికలను నెరవేర్చుకొనుటకు మానవుడు షైతాన్ అడుగు జాడలను పై నడుస్తుంటాడో వాటనింటిని తెలుపుచు హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇలా తెలిపిరి:

"షైతాన్ అసత్యం, దౌర్జన్యం, ఉద్రేకములు, రక్తం సిక్తము, నిరంత ఆశ, ప్రదర్శన, గర్వము వైపు పిలుచును, ఆహ్వానించును". (గర్వము వైపు పిలుచును, ఆహ్వానించును. రండి ఈ దుష్కార్యముల వైపు రండి అని ఎంతో అప్యాయత, ప్రేమతో పిలుచును) "వీటికి భిన్నముగా సద్గుణాలు. సహనం, లీనమగుట, దైవంలో మమేకమవుట, స్వచ్ఛతను, విశ్వాస విజయం ఇవి అల్లాహ్ ఆహ్వానములు". (ఒక వైపు షైతాన్ ఆహ్వానించుచుండగా, మరో వైపు అల్లాహ్ తాలా సత్కార్యముల వైపు ఆహ్వానించుచున్నాడు). "మానవుడు ఈ ఇరు ఆకర్షముల మధ్య సంఘర్షించుచున్నాడు". (అనగా ఒకే రకమైన రెండు రకాల ఆకర్షణల మధ్య నలిగిపోవుచున్నాడు). "కాని సత్యస్వభావము, అదృష్టము కలిగియున్నవారు తనలో ఉద్రేకములు కలిగియున్న కూడ తన స్వచ్ఛత, పతివ్రత, సురక్షిత స్వభావ శుభముల వలన అతనిని షైతాన్ వేల సార్లు ఆహ్వానించినను అతడు అల్లాహ్ వైపే పరుగిడును". (అనగా ఎవరి వ్యక్తిత్వంలోనైతే అల్లాహ్ తాలా బుద్ధిమంతుని లక్షణాలను కల్పించునో ఆ వ్యక్తిని షైతాన్ ఏ విధముగా ఆహ్వానించిన కూడ తనలో గల ఉన్నతమైన లక్షణాల వలన, వాటి శుభముల వలన అతడు షైతాన్ వైపు పరుగెత్తే బదులు, అల్లాహ్ తఆలా వైపు పరుగెత్తి) "అల్లాహ్‌లోనే తన ప్రశాంతతను, తన మనశ్శాంతిని పొందును". (ఎందుకనగా అతడు అల్లాహ్ సన్నిధిలో మ్రొకరిల్లును, అలా మ్రొకరిల్లే గుణం గలవారికి అల్లాహ్ తాలా తన వైపునకు పరుగెత్తె అవకాశంను కల్పించును.)

వారు మరల ఇలా తెల్పిరి:

"ప్రతి వస్తువుకు తప్పనిసరిగా ఒక నిదర్శనము ఉండును. ఎప్పటివరకైతే ఆ నిదర్శనం లభించదో అప్పటి వరకు ఆ వస్తువుపై నమ్మకం కలుగదు. ఒక్క సారి పరిశీలించండి. ఔషధాలను చూడడంతోనే వైద్యుడు దాని స్వభావంను గుర్తించును. ఊదవన్నె వంటి అనేక ఫలాలలో చాలా కాలం పరిశోధించి నిర్ధారించిన తదుపరి కూడ ఒకవేళ ఆ లక్షణాలను పొందనిచో (ఇవి పండ్ల పేర్లు, వీటిలో ఔషధగుణాలు కలవు. కావున వీటిని ఔషధములుగా కూడ ఉపయోగించుతారు) వైద్యుడు వాటిని చెత్తచెధారంను పారవేసినట్లు వీటిని కూడ పడవేయును. అదే విధముగా విశ్వాసం కూడ. అల్లాహ్ తఆలా పదే పదే తన గ్రంధములో వీటిని గూర్చి ప్రస్తావించడం జరిగినది. ఏ రోజున మానవుని హృదయంలో విశ్వాసం జనించునో ఆ విశ్వాసంతో పాటు అల్లాహ్ తఆలా యొక్క గొప్పతనం, అనగా అతని శక్తి, అతని కీర్తి ప్రతిష్టలు, అన్నింటిని మించి ﷻ యొక్క సరియైన భావం వారి హృదయంలో చేరుతుంది. తద్వారా అల్లాహ్ తఆలా వారిలో స్థిర నివాసంను ఏర్పర్చుకొంటాడు. తద్వార షైతాన్ జీవితానికి మరణం సంభవించును. అంతేగాకా పాపపు స్వభావం అంతరించిపోతుంది, ఇది ఎంతటి అదృష్టమైన జీవితం అనగా ఒకవేళ విశ్వాసం పరిపూర్ణమైనచో అతని పాపపు స్వభావం కూడ మరణించును. అప్పుడే ఒక నూతన జీవితం ప్రారంభమవుతుంది. దాని మరో నామమే ఆధ్యాత్మిక జీవితం. లేదా ఆకాశ జీవనపు తొలిరోజు అని చెప్పుకోవడం జరుగుతుంది. అదే విధముగా ఆధ్యాత్మిక జీవనపు తొలి పుత్రోత్సవంగా లెక్కింపబడుతుంది. ఈ సమయంలోనే మానవుడు అల్లాహ్ భక్తుడిగా మారును".

*(మల్ఫూజాత్ సంపుటి 2, పుట 169, ఎడీషన్ 1985 ఇంగ్లాండ్)*

మరల గర్వం మరియు షైతాన్‌ల యొక్క అనుబంధమును గూర్చి హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇలా తెల్పిరి:

"ప్రథమముగా ఆదమ్ తప్పుచేసెను. ధార్మిక ప్రపంచములో ఆదమ్ మరియు షైతాన్‌ల యొక్క పాపమును గూర్చిన చర్చ గలదు. పాపములు రెండు. ఒకటి ఆదమ్ చేసినది. మరొకటి షైతాన్ చేసినది. కాని ఆదమ్‌లో గర్వం లేకుండెను. అందుకే అతడు దేవుని సన్నిధిలో తన తప్పును అంగీకరించెను. అందువలన అతని పాపమును క్షమించివేసెను. ఆనాటి నుండే మానవుని కొరకు ప్రాయశ్చితముతో పాటు క్షమాపణల ద్వారం తెరువబడినది. గర్వించకుండ, పాపములను స్వీకరించుతూ, ప్రాయశ్చిత్తపడుచూ, క్షమాపణలు కోరుకొన్నచో తప్పక క్షమించబడుతారు. లేదా చివరికి అల్లాహ్ తాలా తప్పకుండ క్షమించుననే నమ్మకం కుదురుతుంది, కాని షైతాన్ గర్వించినది. అందుకే అది శాపమునకు గురైనది. అందుకే గర్వితుడైన వ్యక్తి తనలో లేని శక్తి సామర్థ్యములను కూడ తనలో ఉన్నట్లు అనవసరంగా ప్రగల్బాలు పలుకుచుందురు. గర్వించుటకు కూడ మీకు ధైర్యం లేదు, ఎంత వరకు వెళ్ళగలవు, ఎంత ఎత్తుకు ఎదుగగలవు, నీకు శక్తి సామర్థ్యములు లేనప్పుడు మరి ఎందుకు విర్రవీగుచున్నావు. గర్వితుడు అనవసరంగా తనలో లేని లక్షణాలను గూర్చి పదే పదే ఉన్నట్లుగా వాగ్దానాలు చేస్తు ఉంటాడు. ప్రవక్తలలో అనేక నైపుణ్యాలు ఉంటాయి. అందులో ముఖ్యమైనది వారు తమ ఉనికిని అంతమొందించుకునే లక్షణం కూడ గలదు. వారిలో స్వార్థం అనునది ఏ మాత్రం ఉండదు. వారు తమ మనస్తత్వంపై ఒక మరణంను ఆవహింపజేసుకొందురు. గర్వం అనునది కేవలం అల్లాహ్ కొరకే ప్రత్యేకించబడినది. ఎవరైతే గర్వమును ప్రదర్శించరో, విధేయతను చూపించెదరో వారు ఏనాడు వృధా కారు".

*(మల్ఫూజాత్ సంపుటి 9, పుట 281, ఎడీషన్ 1985 ఇంగ్లాండ్)*

అందుకే గర్వంను విడనాడుము. ఇది విశ్వాసులు అలవర్చుకోవలసిన ఒక ప్రత్యేక లక్షణము. అలా కానిచో వారు షైతాన్ అడుగుజాడలలో నడుచువారగుదురు. మానవుడు కొన్ని సందర్భాలలో అహంకారమును చవిచూడడు. అందుకే మనము చాలా జాగ్రత్తగా మనలను మనము పరీక్షించుకోవలెయును.

షైతాన్ ఏవిధముగా మానవున్ని తన ఆధీన్యములోకి తీసుకొనుటకు ప్రయత్నించును? దీనిని గూర్చి హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఒక చోట ఇలా తెల్పిరి: పాపపు పనులు మానవుడు చేయకూడదు. "ఒకవేళ మానవుని దైనందిన జీవనం నుండి పాపములు దూరమైనచో" (అనగా పాపమును తలపెట్టు ఏ పని చేయకూడదు, లేదా అతని నడవడికను చూసి ఎవరు కూడ అతడు పాపత్ముడని భావించుకోకూడదు.) అట్టి పరిస్థితులలో షైతాన్ కేవలం ముక్కు, కళ్ళు, చెవుల వరకే పరిమితమై ఉండును. ఒకవేళ

భాహ్యంగా కూడా మానవుడు పాపములు తలపెట్టకున్నను షైతాన్ మానవుని ముక్కు, కళ్ళు, చెవులలో కూర్చోని ఉండాలని ప్రయత్నిస్తు ఉంటుంది. ఒకవేళ షైతాన్‌కు ఆయా చోట్లలో స్థానం దొరకనిచో కనీసం మానవుని హృదయంలోనైన అది స్థిర నివాసం ఏర్పర్చుకొనుటకు చాలా అధికంగా ప్రయత్నం కొనసాగించును. కొందరు భాహ్యంగా పాపాలు చేయరు. అదే విధముగా పెద్ద పెద్ద పాపాలు కూడ చేయరు. అంతేగాకుండ చిన్న చిన్న పాపాలను కూడ వారు చేయరు. కొందరికి పరస్థితులు అనుకూలించవు, లేదా పాపాలు చేయవలసిన పరిస్థితులు కూడ ఏర్పడవు. లేదా వారికి ఎలాంటి భయము ఉండదు. కావాలని, ఉద్దేశపూర్వంగా ఎవ్వరు కూడ పాపాలు చేయాలని ఆశించరు. కాని షైతాన్ మాత్రం మానవుడు ఎప్పుడు దేవుని నుండి దూరం అవుతాడు, నేను ఎప్పుడు, ఏవిధముగా మానవున్ని పాపముల ఊబిలోకి దించెదను, నేను ఎప్పుడు మానవుని హృదయంలో స్థానం సంపాదించుకోగలను అని అనునిత్యం ఆలోచించుతూనే ఉంటుంది. ఈ విధముగా షైతాన్ తన ప్రయత్నాలను చివరి వరకు తీసుకవచ్చును కాని ఏ మానవుని హృదయంలో దైవ భీతి ఉండునో అట్టి హృదయంలో స్థానంను షైతాన్ ఏనాడు సాధించుకోలేదు. ఒకవేళ మానవుని హృదయంలో దైవ భీతి ఉన్నచో షైతాన్‌కు ఆ హృదయంలో పాపపు విత్తనమును విత్తడం ఏమాత్రం సాధ్యం కాదు. చివరికి అట్టి మానవునితో షైతాన్ నిరాశ చెంది, తన ఆయుధాలను, సామాగ్రిని ప్రోగు చేసుకొని, నిరాశ, నిస్పృహాలతో పరాభావంతో అతనిని వీడి వెళ్ళిపోతుంది".

*(మల్ఫూజాత్ సంపుటి 3, పుట 401,402. ఎడీషన్ 1985 ఇంగ్లాండ్)*

అందుకే ముఖ్యంగా మానవుని హృదయంలో దైవ భీతి యుండవలెయును. దైవభీతి కల్గినప్పడే మానవుడు అనేక పాపముల నుండి రక్షించబడుతాడు. ఒక దొంగ దొంగతనం చేయును. కాని ఆ దొంగ దొంగతనం చేయుచుండగా ఒక చిన్న బాలుడు చూసిన కూడ అతనిలో భయం కలుగును. అందుకే మానవుడు ఎప్పటి వరకైతే తాను చేయుచున్న పనులన్నింటిని దేవుడు పర్యవేక్షించుచున్నాడని భావించడో, లేదా దేవుడు మన పనులన్నింటిని చూస్తున్నాడనే ఆలోచన మానవునిలో జన్మించదో అప్పటి వరకు మానవుడు పాపముల నుండి రక్షించబడడు.

ఎందుకనగా కొన్ని సందర్భాలలో షైతాన్ కూడ మంచి ఆలోచనలను కల్పించుతు కూడ తనను అనుసరింప జేసుకొంటుంది. ఒక సారి ఒక సమావేశంలో దైవవాణి మరియు ఆత్మఘోషలకు గల వ్యత్యాసంనకు సంబంధించి అనగా దైవవాణీలలో అనేక కష్టములు ఉండును అనే అంశంపై చర్చ జరుగుచుండెను. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం సమాధానమిచ్చుచు ఇలా తెలిపిరి. కొందరు ఆత్మఘోష ,షైతాన్ వాక్యముల లో మరియు దైవవాణి మధ్యలో గల వ్యత్యాసంను అర్థం చేసుకోలేక పోవుచున్నారు. ఆత్మఘోష మరియు షైతాన్ వాక్యాలను దైవవాణిగా భావించి మోసపోవడం జరుగుతుంది. దేవుని నుండి అవతరించు దైవవాణి తనలో ఒక ప్రత్యేకతను, మరియు ప్రాముఖ్యతను సంతరించుకొని యుండును. అంతేగాకా హృదయంలో ఒక ప్రోత్సాహం జనించును, ఎందుకనగా అది దేవుని వ్రేళ్ళ నుండి వచ్చినది. దానికి సమతూకంగా మరొకటి ఉండదు. అంతేగాకా అల్లాహ్ తాలా పవిత్ర ఖుర్‌ఆన్‌లో తెల్పినట్లు "ఇన్నా సనుల్ఖీ అలైక ఖౌలన్ సఖీలా" (అల్‌ముజమ్మిల్:6) వలే అది ఉక్కు లాగా పడుతుంది.

అనగా మేము నీపై అవతరింప జేయు వాణి చాలా బరువును కల్గి యుండును. సఖీల్ యొక్క అర్థం ఇదియే. కాని షైతాన్ మరియు ఆత్మ ఘోష ఇలా ఉండదు. ఆత్మఘోష మరియు షైతాన్ వాక్యములు రెండు ఒకే కోవకు చెందినవై యుండును. మానవున్ని ఎల్లప్పుడు అంటిపెట్టుకొను రెండు శక్తులు గలవు. ఒకటి దైవదూత శక్తి, మరొకటి షైతాన్ శక్తి, అనగా మానవుని కాళ్ళను త్రాడుతో బంధించినట్లు, దైవదూత సత్కార్యాముల వైపు ఆహ్వానించుచు అతనికి సహాయ సహకారములు అందించును. దీనిని గూర్చియే అల్లాహ్ తాలా పవిత్ర ఖుర్‌ఆన్‌లో "అయ్యదహుం బిరూహిన్‌హు" (అల్‌ముజాదిలహ్:23) అనగా మేము మా వాణిని పంపించి వారిని ప్రోత్సహించెదము. కాని షైతాన్ ఎల్లప్పుడు చెడునే ప్రేరేపించును. దీనిని గూర్చికూడ అల్లాహ్ తఆలా పవిత్ర ఖుర్‌ఆన్‌లో ఈ విధముగా తెలిపెను. "యువస్ విసు" ఈ రెండు శక్తులను ఎవరు కూడ తిరస్కరించలేరు. అంధకారము, ఉషస్సు రెండు ఒకటికి మరొకటి తోడు యుండును. విజ్ఞానం లేనందున వాస్తవాన్ని కొట్టిపడవేయలేము. అనగా ఏదేని వస్తువుకు తగిన సమాచారం లేనందున ఆ వస్తువే లేదనుట సమంజసం కాదు. విజ్ఞానంయే గాకా ఎన్నో అద్భుతాలు గలవు. అల్లాహ్ తఆలా యొక్క సృష్టిలో గల అద్భుతాలలో ఒకటైన ఈ ప్రపంచమే కాకుండా వేల సంఖ్యలో అనేక అద్భుతాలు గలవు. మరల వారు (అ.స) ఇలా తెలిపిరి: ఖుల్ అవూజ్ బిరబ్బినాస్, నేటి కాలంలో ప్రజల మధ్యలో మొలకెత్తుచున్న షైతాన్ యొక్క దురాలోచనలను గూర్చి గలదు. ప్రత్యేకించి అభివృద్ధి చెందుచున్న కాలంగా పేర్కొనుచున్న నేటి సమయంలో, నేటి రోజులలో ఒక ప్రక్క మానవుడు అల్లాహ్ తఆలా నుండి దూరం వెళ్ళుచుండగా మరోవైపు షైతాన్ తన దురాలోచనలను మానవుని హృదయంలో విత్తుచున్నది. అన్నింటిని మించిన దురాలోచన ఏమిటనగా ఏ విధముగానైతే మానవుడు ధనికుల వద్ద ధనమును చూసివారే తనను సంరక్షించు వారని భావించుకున్నట్లు, సంరక్షకుడైన అల్లాహ్‌ను గూర్చియే తప్పుడు అపోహలను కల్పించుచున్నది. కావున ఈ దురాలోచనల నుండి ఏ విధముగా మానవుడు తనను తాను రక్షించుకోగలడో, మరియు ఈ ధనికులు మనలను సంరక్షించుచు మన అవసరాలను తీర్చుచున్నారా? లేదా అల్లాహ్ తాలా మనలను రక్షించుచు మన అవసరాలును తీర్చుచున్నాడా? తెల్పుచు హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఈ విధముగా తెలిపిరి:

అందుకొరకే వాస్తవమైన పోషకుని శరణంలో ఉండుటకు మీరు దు:ఆ చేసుకొనుము అని అల్లాహ్ తఆలా తెల్పుచున్నాడు. మరల మానవుడు ప్రపంచపు అధికారులను, నాయకులను తమ అవసారాలను తీర్చువానిగా భావంచును. అందుకొరకే అల్లాహ్ తఆలా మలికిన్నాస్ అని దు:ఆ చేయమని తెలుపుచు వాస్తవానికి మానవుని అవసారాలన్నియు తీర్చునది నేనే అని అల్లాహ్ తఆలా ప్రకటించుకొనుచున్నాడు. మరల మానవుడు తోటి ప్రజల నుండి కూడ భయ భ్రాంతులకు గురి అగును, అంతేగాకా కొన్ని పర్యాయములు మానవునికే దానవుడి స్థానంను కల్పించును. అందుకే "ఇలా హిన్నాస్" అని దు:ఆ చేయమని తెల్పుచు నేనే మీ ఆరాధ్యదైవంనని అల్లాహ్ తఆలా ప్రకటించుకొనెను. ఈ మూడు అపోహాల నుండి మానవజాతిని రక్షించుటకు మూడు తంత్రములు గలవు. ఇవి "సూరతున్నాస్" లో గలవు. అంతేగాకా ఈ అపోహాలను కల్పించునది షైతాన్. దీని పేరే తౌరాత్ గ్రంధములో ఇబ్రాని భాషలో నాష్ అని, హవ్వా వద్దకు కనుచాటున వచ్చి దొంగతనంగా దాడి చేసినట్లు పేర్కొనడం జరిగినది. ఈ ఆధ్యాయంలో కూడ దీనిని గూర్చియే గలదు. దీనిని బట్టి అర్థమగు విషయం ఏమిటనగా దజ్జాల్ కూడ ఎదురెదురుగా పోరాడదు. అది దొంగతనంగా దాడులు చేయును. తద్వారా దాని దాడులు ఎవరికి తెలియకుండును. మిరుమిట్లు జిమ్మే ఈ ప్రపంచపు నూతన పరికరాలు, మరియు నూతన విద్యా విధానం పేరుతో అల్లాహ్ తాలా నుండి ధర్మము నుండి మానవులను దూరం చేయడం జరుగడం, ఇందులో పెద్ద పెద్ద రాజ్యాలు, సంస్థలు పాల్గొని మానవ హక్కుల నామముతో అనేక కల్పిత విషయాలను ప్రస్తావించడం జరుగుతుంది. అంతేగాకా చూడండి మీ ధర్మము మిమ్ములను మీ హక్కుల నుండి దూరం చేయుచున్నది, వాస్తవానికి ఈ విషయంలో మానవునికి పూర్తిగా స్వాతంత్రము కావలెయును. ఈ విధముగా నెమ్మది నెమ్మదిగా ఇలాంటి విషపూరిత విషయాలను హృదయంలో విత్తడం జరుగుచుంది. ఈ పనులన్ని నేటి కాలంలో షైతానే చేస్తుంది. మానవ హక్కుల పేరు మీద, లేదా మహిళా హక్కుల పేరు మీద, లేదా మహిళల అధికారాల పేరున పెద్ద పెద్ద రాజ్యాలే ఈ దుర్మార్గపు చర్యలలో పాలు పంచుకొంటున్నాయి. అంతేగాకుండ నేను ముందే తెల్పినట్లు మానవ హక్కుల సంఘం వారు కూడ ఇందులో భాగాస్వాములగుచున్నారు. ఎక్కడనైతే ధర్మము నుండి దూరం చేయుటకు ప్రయత్నములు కొనసాగుచున్నవో అక్కడ షైతాన్ మనపై దాడులు చేయుచున్నదని, దజ్జాల్ శక్తులు మనపై ఆధిపత్యం చెలాయించుటకు ప్రయత్నించుచున్నవని ప్రతి విశ్వాసి, ప్రతి అహ్మదీయుడు, ప్రతి ఒక్కరు అర్థం చేసుకోవలెను.

మరల వారు (అ.స) ఇలా తెల్పిరి: "షైతాన్ తానంతట తానే హవ్వా వద్దకు వెళ్ళినది అనడం సరికాదు. ఎందుకనగా నేడు అది దొంగచాటుగా దాడులు చేయుచున్నందున ఆనాడు కూడ అది దొంగ చాటునే దాడి చేసి ఉండవచ్చును. ఏ వ్యక్తిత్వం గాని, ఏ వ్యక్తి గాని హవ్వా వద్దకు వెళ్ళలేదు.

అది ఈ విధముగానే అపోహలను నింపియుండవచ్చును. వ్యక్తుల మనసులో షైతాన్ తన ప్రభావంను నింపుతుంది. ఆ ప్రభావం షైతాన్‌కు ప్రాతినిధ్యం వహించును. ఎవరో ఒక నాస్తికుడి మనస్సులో షైతాన్ తన ప్రభావంను వేసినది. అంతేగాకా హజ్రత్ ఆదమ్ అలైహిస్సలాం ఉన్నటువంటి స్వర్గం కూడ నేల మీదనే ఉండేది. అంతేగాని ఎక్కడో ఆకాశాన లేకుండెను. ఎవరో ఒకడు దుష్టుడు వారిలో లేనిపోని ఆశలు రేపెను.

అంతే గాకుండ పవిత్ర ఖుర్ఆన్ లోని మొదటి అధ్యాయంలోనే మీరు మార్గభ్రష్టులు, దేవుని ప్రకోపమునకు గురైనవారిలో చేరకుము అని ఉపోద్ఘాతం చేయడమైనది. అనగా: ఓ ముసల్మానులారా! మీరు యూదుల, క్రైస్తవుల చెడు అలవాట్లకు బానిసలు కాకుము. అనగా ముసల్మానులలో కొందరు వారు గుణగణాలను అలవర్చుకొందురని ఈ ఆదేశములో భవిష్యవాణి గలదు. అనగా రాబోవు ఒక కాలంలో కొందరు ముసల్మానులు యూదులు, క్రైస్తవుల గుణాలను అలవర్చుకొందురు. ఎందుకనగా ఆదేశము అనునది ఎల్లప్పుడు ఒక క్రియకు భిన్నంగా నడుచుకొను కొందరు వ్యక్తులు ఉండెదరని నిర్ధారించుకొన్న పిదప ఆదేశించబడును".

*(మల్ఫూజాత్ సంపుటి 2, పుట 244-245, ఎడిషన్ 1985 ఇంగ్లాండ్)*

ఎట్టి పరిస్థితిలోనైనా ధర్మమునకు ప్రాపంచికముపై ప్రాధాన్యతనివ్వవలెనని తెలుపుచు హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇట్లనిరి. "రెండు రకాల ప్రజలు యుందురు. ఒకరు ఇస్లాంను స్వీకరించి ప్రపంచ వ్యాపారములలో నిమగ్నమగుదురు. షైతాన్ వారి తలలపై స్వారీ చేయును. వ్యాపారము చేయుట నిషేధమని నా ఉద్దేశము కాదు. అనుచరులు వ్యాపారము కూడ చేసేవారు. కాని ధర్మమునకు ప్రాపంచికముపై ప్రాధాన్యతనిచ్చేవారు. వారు ఇస్లాంను స్వీకరించి హృదయములను నింపి వేయు ఇస్లాం గురించి నిజమైన విద్యను పొందిరి. ఈ కారణము వల్లనే ఏ మైదానములో వారు షైతాన్ దాడికి గురి కాలేదు. సత్యమును బహిర్గత పరచుటకు ఏ విషయము అవరోధముగా మారలేదు. ఈ ప్రస్తావన వెనుక గల నా ఉద్దేశం ఏమనగా ఏవరైతే కేవలం ప్రపంచమునకే అంకితమై పోవుదురో, బానిసలు అగుదురో మొత్తమునకు వారు ప్రపంచ సాధకులు అగుదురు. ఇట్టి వ్యక్తులపైనే షైతాన్ అధిక ప్రభావంను చూపుతుంది. రెండవ వర్గీయులు ధార్మిక అభివృద్ధి కొరకు ప్రయత్నములు చేయుదురు. ఈ వర్గీయులను అల్లాహ్ సైనికులుగా భావించుదురు. అందుకే వీరు షైతాన్ మరియు దాని సైన్యంపైన విజయంను సాధించెదరు. ధన సమీకరణ ఒక వ్యాపారం, వ్యాపారం వలనే ధనం రెట్టింపు అగును. అందుకే అల్లాహ్ తాలా ధర్మసాధనను, ధర్మాభివృద్ధిని వ్యాపారముగానే నామకరణం చేసెను. అనగా ధర్మమును సాధించుట, ధర్మాభివృద్ధి ఆశించడం ఒక వ్యాపారంవలే ఉండును. ప్రపంచ సంపదంతయు ఈ ప్రపంచములోనే ఉండును. కాని ధార్మిక సంపద ఈ ప్రపంచములోనే గాకుండ పరలోకంలో కూడ మనకు తోడు ఉండును. అందువలనే అల్లాహ్ తఆలా పవిత్ర ఖుర్ఆన్‌లో "హల్ అదుల్లుకుం అలా తిజారతిన్ తున్‌జీకుం మిన్ అజాబిన్ అలీమ్" (అస్సఫ్:11) అనగా నేను మీకు అత్యంత భయానకమైన నరకపు శిక్షనుండి రక్షించు వ్యాపారమును గూర్చి తెలుపవలెనా? ఆ వ్యాపారం చాలా ఉత్తమమైనది. ఆ ఉత్తమమైన వ్యాపారం ధర్మమును సాధించుకొనుట, అదియే భయానకమైన శిక్ష నుండి మనలను రక్షించును. అందుకే నేను కూడ అల్లాహ్ తాలా పదాలకనుగుణంగా జమాఅత్‌కు తెలియజేయునది ఏమనగా, "హల్ అదుల్లుకుం అలా తిజారతిన్ తున్‌జీకుం మిన్ అజాబిన్ అలీమ్" (అస్సఫ్:11)

*(మల్ఫూజాత్ సంపుటి3, పుట 193-194, ఎడిషన్ 1985 ఇంగ్లాండ్)*

కావున మనము ఈ కాల ఇమామ్, దైవ సందేశహరుడు, మసీహ్ మౌవూద్, మహ్దీ మాహూద్ మనలను పిలుచు మార్గముల వైపు తీసుకెళ్లే వ్యాపారము మనము చేయవలెను. తద్వారా మనము షైతాన్ అడుగుజాడల నుండి తప్పించుకోవలెను. అల్లాహ్ తఆలా ప్రీతిని పొందుచు బాధాకర శిక్ష నుండి తప్పించుకోగలము.

మరల గుప్త పాపముల నుండి తప్పించుకొనుమని తెలుపుచు హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇట్లనిరి.

"ఎవరైనా బాధలలో చిక్కుకున్నప్పుడు తుదకు తప్పు మానవునిదనే తెలును. బాధలలో చిక్కుకొన్న తరువాత ఈ బాధ అల్లాహ్ తఆలా తరపున వచ్చినదని అనుట భావ్యము కాదు. తప్పు మానవునిదే. దేవుని తప్పు కాదు. కొందరు బాహ్యముగా చాలా పుణ్యులుగా కనిపింతురు. అతనిపై ఎందుకు ఆపద వచ్చినదని, లేదా ఏదేని పుణ్యమాచరించుటకు ఎందుకు నోచుకోలేదని మానవుడు ఆశ్చర్యపడును. వాస్తవానికి అతని గుప్త పాపములుండును. అవి అతన్ని ఇక్కడికి చేర్చియుండును. అల్లాహ్ తఆలా అతిగా క్షమించును, విస్మరించును. అందుకే మానవుని గుప్త పాపములు ఎవరికి తెలియవు. వాస్తవానికి గుప్త పాపములు బాహ్య పాపముల కంటే నీచముగా యుండును. పాపముల స్థితి కూడ వ్యాధుల మాదిరిగానే యుండును. పెద్ద వ్యాధులను ప్రతి ఒక్కరు చూచెదరు. ఫలానా వ్యాధి అని బాహ్య వ్యాధిని గుర్తించును. కాని కొన్ని అంతర వ్యాధులుండును. నన్ను ఫలానా ప్రమాదము ఆవహించుచున్నదని రోగికి కూడ తెలియదు. ఇదే విధముగా జ్వరము కూడ కొన్ని సార్లు వైద్యునికి అంతుపట్టదు. తుదకు అది భయానక స్థితికి చేరును. కొన్ని సార్లు చివరి దశలో తెలియును. కొన్ని సార్లు కేన్సర్ రోగులు బాహ్య రూపంలో ఆరోగ్యముగా తిరుగుదురు కాని అకస్మాత్తుగా కేన్సర్ చికిత్స చేయలేని దశకు చేరుకున్నదని తెలియును. పూర్తిగా వ్యాపించి నెలలోపే మానవుడు అంతమగును. వ్యాధి తెలియనట్లే మానవుని అంతర పాపములు క్రమ క్రమంగా అతన్ని నాశనము వరకు చేర్చును. అల్లాహ్ తఆలా తన దయతో కరుణించుగాక! పవిత్ర ఖుర్ఆన్‌లో ఇట్లు వచ్చెను. قد افلح من زكٰها (అష్షంస్:10) తన మనసును పవిత్రము చేసుకున్న వ్యక్తి సఫలమయ్యెను. కాని పవిత్ర మనసు కూడ ఒక మరణమే. నీచమైన ప్రవర్తనలన్నిటిని వీడనిదే అనగా షైతాన్ నడిపించదలచిన అశ్లీల, అయిష్టమైన ప్రవర్తనలు, వృధా, పనికిమాలిన ప్రవర్తనలు వీడనిదే పవిత్ర మనసు ఎక్కడ లభించును. అల్లాహ్ తఆలాకు ఇష్టము లేని ప్రతి విషయము అయిష్టమైనదే. నీచమైన ప్రవర్తనలను వీడనంత వరకు పవిత్ర మనసు ఎక్కడ లభించును. ప్రతి వ్యక్తిలో ఏదో ఒక దుష్టత్వ బీజము యుండును. అదే అతని షైతాన్. దానిని హతమార్చనిదే పని పూర్తి కాదు".

*(మల్ఫూజాత్ సంపుటి 9, పుట 280,281. ఎడిషన్ 1985 ఇంగ్లాండ్)*

ఇంతుకు ముందు ప్రస్తావించినట్లు మనకు ఎల్లప్పుడు అల్లాహ్ తఆలా శరణము అవసరముండును. తమ ఆత్మ పరిశీలన చేసుకోవలసిన అవసరమున్నది. షైతాన్‌ను చంపుటకు ఎలా అడుగు వేయాలో తెలుపుచు హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇట్లనిరి.

"సందేశహరులు దైవ స్వరూపులు. సందేశహరుల స్వరూపులే నిజమైన ముస్లింలు. అనుచరులు ఈ రహస్యమును బాగుగా తెలుసుకొని యుండిరి. వారు రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం విధేయతలో ఎలా నిమగ్నమై, లీనమైనారనగా వారి ఉనికిలో మరేమి మిగల లేదు. వారిని చూచిన వారు వారిని లీనమైనట్లు పొందెను. అల్లాహ్ తఆలా సామీప్యమును పొందుటలో ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఆదర్శమును అవలంభించుకొనుటలో లీనమైరి. కనుక నేడు కూడ గుర్తుంచుకొనుము. గౌరవ అనుచరులలో గల లీనము, విధేయత నేటి కాలములో ప్రవేశించనంత వరకు అభిమానులు, విశ్వాసులలో చేరు ప్రకటన నిజము, సమంజసము కాజాలదు. అల్లాహ్ తఆలా మీలో తిష్టవేయనంత వరకు, అల్లాహ్ తఆలా చిహ్నములు మీలో బహిర్గతము కానంత వరకు షైతాన్ ప్రభుత్వ జోక్యము యుండునని గట్టిగా గుర్తుంచుకొనుము".

*(మల్ఫూజాత్ సంపుట 2, పుట 168, 169. ఎడిషన్ 1985 ఇంగ్లాండ్)*

మనము వినమ్రతతో అల్లాహ్ వారమగుటకు అల్లాహ్ తఆలా అనుగ్రహించుగాక! అన్ని అశ్లీల, అయిష్టమైన వాటి నుండి దూరముందుము గాక! తమ మనసును పవిత్రము చేసుకొనుటకు ప్రయత్నించుదుము గాక! అల్లాహ్ తఆలా శుభములకు వారసులగుదుము గాక!

సదా మన చూపు దేవునిపై యుండుగాక! అతడే మన పోషకుడు. సదా అతని యజమాన్యము మన హృదయములను పాలించుగాక! అతడే మన ఆరాధ్యుడు. అతన్ని మనము సదా స్మరించువారమగుదుము గాక! షైతాన్ అడుగుజాడలపై నడవకుండా యుందుము గాక! అల్లాహ్ తఆలా ఇందుకు మనందరిని అనుగ్రహించుగాక! (ఆమీన్)

**EDITOR**
SYED RASOOL NIYAZ
**SUB EDITOR:** MOHAMMAD AKBAR
Mobile. :(+91) 9948692101
e-mail :badartel001@gmail.com
website:www.akhbarbadarqadian.in
:www.alislam.org

Title Code: PUNTEL00001
The Weekly **BADAR** Qadian బదర్ వార పత్రిక ఖాదియాన్
Distt: Gurdaspur (Pb.) INDIA Qadian - 143516
Vol.1. Thursday 14 April 2016 Issue No.6

**MANAGER**
NAWAB AHMAD
Mobile. : (+91) 94170-20616
Tel : (+91)-1872-224757
e-mail :managerbadrqnd@gmail.com
ANNUAL SUBSCRIPTION:Rs.300/-


**సందేశహరుల ద్వారా పుట్టే అలల అంగీకారము:**

హజ్రత్ మూసా దైవ సందేశహరులని ప్రపంచము నమ్మినా నమ్మకపోయినా హజ్రత్ మూసా ద్వారా ఒక అల వెలువడి ఇస్రాయీల్ సంతతి మొత్తములో వ్యాపించిన విషయమును ఏ జాతి నిరాకరించలేదు. హజ్రత్ మసీహ్ దైవ సందేశహరులని నిరాకరించవచ్చును కాని వారి కాలములో కూడ ఒక అల ఎగిసిపడినదను విషయమును నిరాకరించలేరు. ఇదే విధముగా రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లంను ప్రజలందరు దైవ సందేశహరులని నమ్మకపోవచ్చును కాని గతములో ఏర్పడని మార్పు వారి ద్వారా ప్రపంచములో తప్పక ఏర్పడినదని ప్రపంచము నమ్మకపోవడానికి మరో దారి లేదు. ఇది స్పష్టమైన, ప్రతి ఒక్కరు గ్రహించే మార్పు.

**ఆధ్యాత్మిక అల గుప్త ప్రభావము:**

సాధారణ ప్రజలు గ్రహించని ప్రభావము కూడ గలదు. కాని అనుభవము సూచించునదేమనగా అతి చిన్న కర్మ కూడ ప్రపంచములో వ్యాపించును. ఒకే చోట నిలువదు. నడిపించిన యంత్రము ఒక చోట ఆగక ముందుకే వెళ్లును. కదలికలన్ని ఈ పరిసర ప్రాంతములో వ్యాపించును. వాటి ప్రభావములు దూరము వరకు చేరును. ఇదే విధముగా ఆధ్యాత్మిక ప్రపంచములో ఎగిసిన అలలు కూడ వ్యాపించును. సుదూర ప్రాంతమునకు చేరును. రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం పరిసర ప్రాంత ఉదాహరణ చరిత్రలో స్పష్టమైన రీతిలో భద్రముగా యున్నది. దానిని పరిశీంచెదము.

**అన్యారాధన ధోరణి:**

ప్రపంచ జాతులన్ని దాదాపు అన్యారాధనలో మునిగి తేలుచున్న కాలములో రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం అవతరించిరి. దాదాపు అను పదమును నేనెందుకు వినియోగించినాననగా వ్యక్తిగతంగా దైవ ఏకత్వమును విశ్వసించేవారు ఆ కాలములో కూడ కొందరుండిరి. కాని వారి ప్రభావము లేకుండెను. సుమారు ప్రతి చోట అన్యారాధనే రాజ్యమేలుచుండెను. ఆ కాలములో బహుదైవములను నమ్ముట ఒక ఫ్యాషన్‌గా మారెను. దీని సాక్ష్యము ఇట్లు లభించును. దైవ ఏకత్వమును విశ్వసించే జాతులలో కూడ ఏదో ఒక రకంగా ఒక్కరి కంటే ఎక్కువ దేవుళ్లను అంగీకరించేవారు. ఇస్రాయీల్ సంతతి పుస్తకములన్నియు ఒక్క దేవుడు తప్ప మరొకరిని నమ్మకూడదని బోధించుచున్నవి. అజీజ్ దేవుని కుమారుడని వారనేవారు. ఆరంభములో స్వచ్ఛమైన దైవ ఏకత్వ పునాదిపై గల జర్తిష్తి ధర్మము కూడ పూర్తిగా అన్యారాధనలో లీనమైన స్థితిలో యుండెను. ఇటు భారతదేశములో విగ్రహారాధన ఎంత వరకు చేరెననగా ఒక్క దేవున్ని ఆరాధించే బదులు రక రకాల విగ్రహాలను పూజించుచు, ఆరాధించేవారు. క్రైస్తవులు హజ్రత్ ఈసాను దేవుని కుమారునిగా మార్చి వేసిరి. దీనితో తెలియునది ఏమనగా ఆ కాలములో జాతులన్ని అన్యారాధనను నమ్మకపోయినా దైవ ఏకత్వముపై స్థిరముగా లేకుండెను. దైవ ఏకత్వముపై నిలిచినచో అంతమైపోతామని కూడ వారు భయపడేవారు. ఉదాహరణకు ముసుగు గురించి సాధారణ ప్రజల ఒక అభిప్రాయము గలదు. అందుకే దీనికి విరుద్ధముగా ఒక ధోరణి కొనసాగుచున్నది. దీనితో ప్రభావితమై ముస్లిములు కూడ ముసుగును పూర్తిగా ఎత్తివేయాలి లేదా ఐరోపా వాసులకు మేము ముసుగు ధరించినట్లు తెలియకుండా కుదించాలని అంటున్నారు. ఇదే విధముగా బహుభార్యత్వమును కూడ ఐరోపా వాసులకు తెలియకుండా దాచిపెట్టాలని ముస్లిములు ప్రయత్నించుచున్నారు. ఇందుకు రక రకాల ఎత్తుగడలు వేయుచున్నారు. కాని అసలు విషయమేమనగా నేడు కొనసాగుచున్న ధోరణికి ధీటుగా మనము నిలిచినచో, దాని వెంట ప్రవహించనిచో మన ధర్మము కొనసాగలేదని భయపడుచున్నారు. ఇదే విధముగా మరిన్ని సమస్యలు గలవు. ఉదాహరణకు నమాజ్. బాహ్య నమాజ్ అవసరమేమిటని దీని గురించి కూడ అందురు. ఇది పాత కాలపు ప్రజల కొరకు యుండెను. ఇప్పుడు బల్ల లేదా కుర్చిపై కూర్చొని దేవున్ని ప్రశంసించుచు, దేవుని పేరు వచ్చినచో కొంచెం తల వంచితో సరిపోవును. ఇలా ఎందుకు అంటున్నారు? ఎందుకనగా నేడు కొనసాగుచున్న ధోరణి వలన మనము మన అసలు విశ్వాసాలను పాటించినచో అంతమైపోతామని ప్రజలు భావించుచున్నారు. రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం అవతరించిన కాలములో కూడ దైవ ఏకత్వ పరిస్థితి ఇలాగే మారిపోయెను. ఏదో ఒక రకంగా అన్యారాధనను అవలంభించనిదే మనము స్థిర పడలేమని సర్వ మతాలలో ఒక ధోరణి మొదలయ్యెను. ఏ అపవిత్ర స్వభావికుని హృదయములో ఈ ధోరణి అందరి కంటే మొదట ఏర్పడెను. చరిత్ర నుండి మనకీ విషయము తెలియదు. కాని ఈ మలిన ధోరణి తప్పక పుట్టి ఇబ్లీస్ ధృవీకరణతో వ్యాపించినదను విషయములో అనుమానం లేదు. *(సశేషం)*

**శిక్షణా సమావేశము జిల్లా వరంగల్**

అల్లాహ్ తఆలా కృపానుసారము అహ్మదియ్య జమాఅత్ వెంకటాపూర్‌లో జిల్లా స్థాయి శిక్షణా సమావేశము 21 ఫిబ్రవరి 2016 తేదీన నిర్వహించబడెను. ఉ॥ 11:30 గం॥లకు నా అధ్యక్షతన గౌ॥ హాఫిజ్ ముహమ్మద్ షరీఫ్ గారి పవిత్ర ఖుర్‌ఆన్ పఠనముతో సమావేశము ప్రారంభమయ్యెను. అనంతరం గౌ॥ ఇన్కిషాఫ్ అలీ గారు మధుర స్వరములో పద్యము వినిపించగా ఈ సమావేశములో మొదటి ఉపన్యాసము గౌ॥ వజీర్ అహ్మద్ ముఅల్లిమ్ సిల్సల గారు "కర్మల సవరణ హుజూరె అన్వర్ ఖుత్బాల ఆధారముగా" అను శీర్శికన తెలుగు భాషలో చేసినారు. వారి తరువాత రెండవ ఉపన్యాసము గౌ॥ కె.నాసిర్ అహ్మద్ నాయిబ్ నాజిర్ బైతుల్ మాల్ ఆమద్ ఖాదియాన్ గారు చేసినారు. అనంతరం బాలికలు ఒక పద్యము చదివి వినిపించినారు. మూడవ ఉపన్యాసము "ప్రపంచ శాంతి స్థాపన కొరకు అహ్మదియ్య సంఘ కృషి" అను శీర్షికన గౌ॥ ముహమ్మద్ అక్బర్ గారు తెలుగు భాషలో చేసినారు. చివరలో నేను అహ్మదీయుని స్థాయి, ఖిలాఫత్‌తో కొనసాగించవలసిన అనుబంధ ప్రాముఖ్యత గురించి పలు విషయములను తెలిపి, దుఆ చేయించి సమావేశ ముగింపును ప్రకటించితిని.

జుహ్ర్,అస్ర్ నమాజుల తరువాత హాజరైన సభ్యులదంరికి భోజన వసతి కల్పించనైనది. అల్లాహ్ తఆలా కృపానుసారము జిల్లా వరంగల్‌లోని 18 జమాఅతుల నుండి 200 కంటే అధిక సభ్యులు ఈ సమావేశములో పాల్గొని ఆధ్యాత్మిక లబ్ధి పొందిరి. అల్లాహ్ తఆలా ఈ సమావేశ సత్ఫలితములను వెల్లడించుగాక! ఆమీన్.

*(షబ్బీ ర్ అహ్మద్ యాకూబ్ – జిల్లా అమీర్ వరంగల్)*

***విన్నపం:*** తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ అహ్మదియ్య జమాఅత్ గౌ॥ జిల్లా అమీర్లు తమ తమ జిల్లాలో నిర్వహించుచున్న ముఖ్య శిక్షణ, ప్రచార సమావేశముల సంక్షిప్త నివేదికలు పంపగలరని కోరుచున్నాము. తద్వారా ఇతరులకు ప్రోత్సాహము లభించడమే కాక ఇవి చరిత్ర పుటల్లో భద్రముగా యుండును. *(సంపాదకులు)*

Printed & Published by: Jameel Ahmed Nasir on behalf of Nigran Board of Badar, at Fazle-Umar Printing Press Qadian, Harchowal Road, Qadian
Distt: Gurdaspur-143516, Punjab, India. And published at office of the Weekly Badar Moh-Ahmadiyya, Harchowal Road P.o:Qadian Distt:Gsp-143516, Punjab.India.Editor: Syed Rasool Niyaz